



నేడు కేసీఆర్ పొలంబాట

● ముగ్దుంపూర్‌కు రానున్న మాజీ ముఖ్యమంత్రి ● ఎండిన పొలాల పరిశీలన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పొలం బాట పడుతున్నారు. సాగునీరందక పొలాలు ఎండుతుంటే రైతన్నలను కలిసి పరామర్శించి వారి కష్ట సుఖాలు తెలుసుకునేందుకు ఆయన శుక్ర వారం ఉదయం జిల్లాకు రానున్నారు. కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్ గ్రామంలో సాగు నీరందక ఎండిన పంట పొలాలను ఆయన పరిశీలిస్తారు. రైతులతో మాట్లాడి సాగునీటి కొరత, అందుకు కారణాలను, ఇతర సమస్యలను అడిగి తెలుసుకుంటారు.



అనంతరం ఆయన బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో పర్యటించి సాగునీటి సమస్యలను తెలుసు కుంటారు. అధికార కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టులో ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ నేతలు వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తోంది. ఆ కారణంగానే మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోయి ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని, రాష్ట్రాన్ని వేల కోట్ల రూపాయల అప్పుల పాలు చేయడమే కాకుండా ఈనాటి సాగునీటి పరిస్థితికి కేసీఆరే కారణమని విమర్శి స్తున్నది. అదే కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని అస్త్రంగా మార్చి బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌ను ప్రజల్లో ఎండగట్టాలని చూస్తున్నది. ప్రస్తుతం ఏర్పడ్డ సాగునీటి కరువు కాలం తెచ్చింది కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని చెబుతూ కేసీఆర్ పొలంబాట కార్యక్రమాన్ని ప్రకటించి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నల్గొండ, సూర్యా పేట, జనగాం జిల్లాల్లో తిరిగి పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించిన కేసీఆర్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల పర్యటనను చేపట్టారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు

కేసీఆర్ పొలంబాట కార్యక్రమాన్ని ప్రకటించగానే కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధి లో బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు జిల్లాల్లో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి కరువుకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నేతలు కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని రామడుగు, గంగాధర మండలాల్లో పంట పొలాలు ఎండి పోతున్నాయని, సాగునీటి సమస్యను పరిష్కరించాలని, ఎండిన పొలాలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కరీంనగర్-నిజామాబాద్ రహదారిపై ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పార్టీ మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లిలో 36 గంటల రైతు నిరసన దీక్షను చేపట్టారు.

రైతులకు క్షమాపణ చెప్పిన తర్వాతే కేసీఆర్ జిల్లాకు రావాలంటున్న బీజేపీ

తన పాలన కాలంలో రైతుల సమస్యలను పరిష్కరించలేక పోయినందుకు కేసీఆర్ క్షమాపణలు చెప్పిన తర్వాతే జిల్లాకు రావాల ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాది మార్చిలో చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు మండలం లక్ష్మీపూర్ వచ్చిన కేసీఆర్ వారం రోజుల్లో నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి రూ. 10 వేలు ఇస్తానని ప్రకటన చేసింది నిజం కాదా అని ప్రశ్నిస్తున్నారు. నెలలు గడిచినా అత్యధిక సంఖ్యలో రైతులకు నయాపైసా సాయం అందించని మాట వాస్తవం కాదా అని నిలదీస్తున్నారు. పంట నష్ట పోయి అప్పులు పుట్టక కొందరు, వడ్లుకొనే నాథుడు లేక వడ్ల కుప్పలపైనే రైతులు గుండెలు పగిలి చనిపోయినా కనీసం పరామ ర్శించని కేసీఆర్ ఏముఖం పెట్టుకొని పంట పొలాలను సందర్శిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగు నీరందకపోగా కేసీఆర్ కుటుం బానికి ఏటీఎంగా మారింది నిజం కాదా, లక్షా 30వేల కోట్లు ఖర్చుచేసి కట్టిన కాళేశ్వరం కమీషన్లకే తప్ప రైతుల కన్నీళ్లు తుడచలేక పోయిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నిస్తున్నారు.

పర్యటన షెడ్యూల్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పొలంబాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఎరవెల్లి ఫామ్ హౌజ్ నుంచి బయలు దేరి 10.30 గంటలకు కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్‌కు చేరుకొని అక్కడ ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తారు.

మధ్యాహ్నం ఒంటి గంటకు అక్కడి నుంచి బయలు దేరి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసానికి చేరు కుని భోజనం చేస్తారు. 2 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి మండలానికి చేరుకొని అక్కడ ఎండిపోయిన పంట పొలాలను సందర్శించి రైతులను పరామర్శిస్తారు. 3 గంటలకు మిడ్ మానేరు ప్రాజెక్టును సందర్శించి సిరిసిల్లకు వెళ్తారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో సాయంత్రం 4 గంటలకు మీడియా సమావేశంలో మాట్లాడి సాయంత్రం 5 గంటలకు అక్కడి నుంచి ఎరవెల్లి ఫామ్ హౌస్ బయలుదేరుతారు.

ఓటు వేయడం అందరి బాధ్యత



జెండా ఊపి ఓటరు అవగాహన 2కె రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 4: ఓటు వేయడం అందరి బాధ్యత అని, అర్హులైన వారందరూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. గురువారం కరీంనగర్ స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ స్టేడియంలో జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు.

కలెక్టర్ పమేలా సత్పతి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకు నేందుకు ఈనెల 15వరకు అవకాశం ఉందని తెలిపారు. సర్కస్ గ్రౌండ్‌లో ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, స్వీప్ నోడల్ అధికారి,మైనింగ్ శాఖ ఏడీ రామాచారి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, మెప్మా పీడీ రవీందర్, ఆర్డీవో కె మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, సోషల్ వెల్ఫేర్ అధికారి నేతానియల్, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పెటా జిల్లా అధ్యక్షుడు అంతడ్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

వ్యాధులు ప్రబలకుండా
చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీడీ వెంకటేష్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4: వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే దోమల నివారణ చర్యలు చేపట్టాలని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్ సూచించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యలపై వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నా యన్నారు. దోమలు అభివృద్ధి చెందకుండా తీసుకోవాల్సి చర్యలపై అవగాహన కల్పించారు. మండల, గ్రామీణ స్థాయిలో స్థానిక అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీలతోపాటు వివిధ శాఖలు, స్థానిక సంస్థల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూ చించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజగోపాల్‌రావు, కన్సల్టెంట్ సైదులు, సబ్ యూనిట్ అధికారి ఎం రామనాథం పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 4: షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి నతానియేలు ఒక ప్రకటనతో తెలియజేశారు. వసతి, భోజనంతో కూడిన ఈ శిక్షణ రెండు నెలలపాటు ఉంటుందన్నారు. జిల్లాకు చెందిన అర్హత కలిగిన షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు ఈనెల ఏడో తేదీ లోపు అంబేద్కర్ భవనం టీఎస్ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని తెలిపారు. టెట్ అర్హత సాధించి బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులైనవారు అర్హులని చెప్పారు.

ఎస్సెస్సీ స్పాట్‌లో రగడ

● విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు
● ఉపాధ్యాయ సంఘాలతో డీఈవో చర్చలు
● నేటి ధర్నాను ఉపసంహరించుకున్న ఉపాధ్యాయులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4: పదో తరగతి పరీక్షా జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో విధులపై వివాదం చెలరేగింది. వివిధ కారణాలతో స్పాట్ విధులకు కొంత మంది ఉపాధ్యాయులు హాజరు కాలేదు. గైర్హాజరైన పలువురు ఉపాధ్యాయులకు డీఈవో షోకాజ్ మెమోలు జారీ చేయడం కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభమైంది.



డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులను స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఆసక్తి ఉన్న జూనియర్ ఉపాధ్యాయులకు స్పాట్ విధులు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశారు. స్పాట్ కేంద్రంలో మెరుగైన వసతులు కల్పించాలని డీఈవోకు వినతి పత్రాలు సమర్పించాయి. స్పాట్ వాల్యుయేషన్ విధులకు ఉపాధ్యాయులు విధిగా హాజరుకావాలని, గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు తప్ప వంటూ డీఈవో ఉపాధ్యాయులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో విధులకు హాజరుకాలేని కొంత మంది ఉపాధ్యాయులు తమకు స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ హెడ్మాస్టర్లు, ఎంఈవోలు, డీఈవోకు వినతిపత్రాలు ఇచ్చారు. సరైన కారణంతో స్పాట్ విధులకు హాజరుకాలేని వారికి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులు స్పాట్ విధులకు ఎందుకు హాజరు కారని, అనారోగ్యంతో ఉన్నవారు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని సూచించారు.

స్పాట్ కేంద్రానికి మెడికల్ బోర్డును తీసుకువచ్చి స్పాట్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరిన ఉపాధ్యాయులకు అక్కడే పరీక్షలు జరిపించారు. దీన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుబట్టాయి. మెడికల్ బోర్డును స్పాట్‌కు తీసుకువచ్చి పరీక్షలు చేయడమంటే ఉపాధ్యాయులను అవమానపరచడమేనని, స్పాట్ విధులను నిర్వహించేందుకు అనేక మంది జూనియర్ ఉపాధ్యాయులు ఆసక్తి చూపుతున్నా ఏకపక్షంగా వ్యవహరించడం సరి కాదంటూ డీఈవో తీరును తప్పుబట్టాయి.

డీఈవో తీరును ఖండిస్తూ, తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశాయి. స్పాట్ కేంద్రంలో మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలని, లేకపోతే శుక్రవారం స్పాట్ కేం ద్రంలో ధర్నా చేస్తామంటూ డీఈవోకు వినతిపత్రం అందజేశారు. దీంతో డీఈవో గురువారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వానించి షోకాజు మెమోలను ఉపసంహరించుకుంటామని తెలిపారు. అనారోగ్యం, వయోభారంతో ఉన్న ఉపాధ్యాయులకు విధుల నుంచి మినహాయించి, జూనియర్లకు విధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. డీఈవో హామీతో ధర్నాను ఉపసంహరించుకుంటున్నామని ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి.

కనీస మద్దతు
ధరకే ధాన్యం కొనాలి

కలెక్టర్ పమేలా సత్పతి



మానకొండూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, ఏప్రిల్ 4: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మానకొండూర్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ది హైదరాబాద్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఏ గ్రేడ్ రకానికి 2,203, సాధారణ రకానికి 2,183 రూపాయల మద్దతు ధరను పొందాలని అన్నారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో హమాలీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పని చేయాలని తెలిపారు. వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వరి ధాన్యానికి తేమ 17 శాతం వచ్చేలా చూసి కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో నర్సయ్య, మార్కెట్ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి..

హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు

ఇల్లందకుంట, ఏప్రిల్ 4: శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 15 నుంచి 27వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు అన్నారు. గురువారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శ్రీ రామ నవమి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆలయ మండపం, చలువ పందిళ్లు, అన్నదాన కార్యక్రమం వద్ద క్యూలైన్లు, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడే ఉండి అన్ని ఏర్పాట్లు పరిశీలించాలని ఆలయ కార్య నిర్వాహణాధికారి సుధాకర్‌ను ఆదేశించారు.



కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్‌బాబు

ఈ ఏడాది స్వామివారి కల్యాణానికి 50 వేలకు పైగా భక్తులు రావచ్చని, వారికి అన్ని వసతులు కల్పించాలని, ఇబ్బందులు కలుగకుండా పర్య వేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్ర మంలో తహసీల్దార్ రాణి, రూరల్ సీఐ కిశోర్, ఎస్ఐ రాజ కుమార్, ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

వరి కోతలు ప్రారంభం

దిగుబడి తగ్గిందని రైతుల ఆందోళన



సైదాపూర్ మండలం రాంచంద్రాపూర్‌లో వరి కోతలు

సైదాపూర్, ఏప్రిల్ 4: యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. సాగు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడ్డ రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పంటను చివరి దశకు తీసుకొచ్చారు. మండలంలో 10 శాతం పొలాలు ఎండి పోయాయి. ఈసారి దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు. వరికి మొగి పురుగు ఆశించడంతో పంట దెబ్బ తిన్నది. సాధారణంగా యాసంగిలో 28 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ఈసారి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గత యాసంగిలో అకాల వర్షాలతో పొలాలు దెబ్బతిన్నాయి. ఈసారి అలాగే జరిగితే నష్టపోతామని భయపడుతున్న రైతులు కోసిన వెంటనే పచ్చి ధాన్యాన్నే వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి
గుండేటి వాసుదేవ్, రైతు సంఘం నాయకుడు, ఎక్లాస్‌పూర్

ఈ యాసంగి సీజన్‌లో వరి పంట దిగుబడి చాలా వరకు తగ్గింది. ఎక రాకు సుమారు 5 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గింది. దీంతో రైతులు నష్ట పోతు న్నారు. ప్రభుత్వం వరికి బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: ఆర్థిక ఇబ్బందులు తాళలేక భవన నిర్మాణ కార్మికుడు సిరిపురం ముత్తయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ముత్తయ్య భవన నిర్మాణ కార్మికుడిగా కొనసాగుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట కొడుకు శ్రీనివాస్‌ను రూ.2లక్షలు అప్పులు బహ్రెయిన్ దేశానికి పంపించాడు. మరో రూ.2 లక్షలు బాకీలు చేసి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. కూలీ పనులు చేసిన కుటుంబ పోషణ భారంగా మారింది. చేతిలో డబ్బులు లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. ఓ వైపు అప్పులు.. మరో వైపు కుటుంబాన్ని పోషించే మార్గం కానరాక మనస్థాపం చెందిన ముత్తయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4; మండలంలోని పాతగూడూర్‌లోని దస్తగిరి గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో జగిత్యాల మైనింగ్ అధికారులు రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ని పట్టుకు న్నారు. మైనింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మాకు వచ్చిన పక్కా సమాచా రంతో పాతగూడూర్ దస్తగిరి గుట్టకు వెళ్లగా అక్కడ రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తుం డగా పట్టుకుని వాటికి సుమారుగా 4 వేలు జరిమానా విధించినట్టు మైనింగ్ అధికారులు తెలిపారు. మండలంలో అక్రమ మట్టి రవాణా చేస్తే వాహనాలను పట్టుకొని చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారినైనా వదలమని మైనింగ్ అధికారులు తెలిపారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి

- 12 మందికి గాయాలు

రామడుగు, ఏప్రిల్ 4: మండలంలోని వెదిర గ్రామంలో ఉపాధిహామీ కూలీలపై తేనేటీగలు గురువారం దాడి చేశాయి. పనులు చేపట్టేందుకు వెళ్లిన కూలీలపై దాడి చేయగా 12 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడడంతో సాయంత్రం 12 మందిని ఇంటికి తరలించారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట, ఏప్రిల్ 4: జమ్మికుంట-ఉప్పల్ రైల్వే స్టేషన్ల మధ్య ఓ యువకుడు పాట్నా ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి గురువారం మృతి చెందాడు. ఝూర్ఖాండ్ రాష్ట్రం చత్ర జిల్లా కోటప్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (18) అనే యువకుడు హైదరాబాద్‌లో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి స్వగ్రామం వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో పాట్నా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మార్గ మధ్యలో జమ్మికుంట-ఉప్పల్ స్టేషన్ల మధ్య రైల్లో నుంయి ప్రమాద వశాత్తు కింద పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ.7,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,650 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 45మంది రైతులు 737క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,650, కనిష్ఠ ధర 5వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆది, సోమ, మంగళవారాలు మార్కెట్‌కు సెలవు దినాలు కాగా, తిరిగి బుధవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మార్కెట్ కార్యదర్శి గూగులోతురెడ్డి నాయక్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సైదాపూర్, ఏప్రిల్ 4: మండలంలోని సోమారం గ్రామ శివారులో పేకాడుతున్నారనే సమాచా రం మేరకు దాడి చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్య తెలిపారు. గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఏడుగురు పేకాడుతున్నారని చెప్పారు. ఇందులో నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, ముగ్గురు పారిపోయారని తెలిపారు. వారి నుంచి 3,100 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు

వీణవంక, ఏప్రిల్ 4: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు పీర్ల రఘు, అశాడపు వినయ్‌ల పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వినయ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలమని, పీర్ల రఘు పరారిలో ఉన్నారని తెలిపారు.

రెండో విడత జేఈఈ మెయిన్స్ ప్రారంభం



ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలోనికి వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్4: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం ప్రారంభమైనా ఈ పరీక్షలు ఏప్రిల్ 5,6,8,9,12వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో ఈ పరీక్షలు నిర్వహిం చనున్నారు. మొదటి రోజు గురువారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే నిర్వహించారు. మొదటి షిఫ్టులో 676 మంది విద్యా ర్థులకు 598 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 676 మందికి 610మంది హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 4: శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన సిరిసిల్ల ఆంజనేయులు (34) వ్యవసాయ కూలీ, హార్వెస్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామంలో సామూహిక పోచమ్మ బోనాలు ఉన్నందున ఫంక్షన్‌కు వెళ్లవద్దని తల్లి, భార్య చెప్పినా వినకుండా అతడి మేనల్లుడు మంద హరీష్‌ను వెంటబెట్టుకొని హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్‌కు వెళ్లారు. ఫంక్షన్ ముగించుకొని సింగాపూర్ నుంచి చింతగుట్టకు వస్తుండగా కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా కరీంనగర్-వరంగల్ రహదారిపై కరీంనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్తున్న సిరిసిల్ల డిపో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న హరీష్ ప్రమాదం నుంచి సురక్షింతంగా బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై పాకాల లక్షారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడికి తల్లి బుచ్చమ్మ, భార్య పూజ, ఇద్దరు కుమారులు సాయిగణేష్, సాత్విక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలి



కలెక్టరేట్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల భత్యాలలో ఏకరూపత పాటించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ఏఓకు హన్మంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ హన్మంత్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి అత్యావసరాలు గల ఉద్యోగ, ఉపాధ్యాయులను మినహాయిం చాలని కోరారు. చిన్న పిల్లలు గల తల్లులు, దివ్యాంగులను, పదవీ విరమణకు దగ్గరగా ఉన్న వారిని మినహాయించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి వసతి కల్పించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక్కో రీతిగా ఎన్నికల భత్యాల పంపిణీ చేశారని, అతి తక్కువగా కోరుట్ల నియోజకవర్గంలో చెల్లించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహాధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపల్లి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు చేరుకున్న సైకిల్ యాత్ర

వేములవాడ, ఏప్రిల్ 4: ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం వేములవాడకు చేరుకుంది. రాజు ఐదు రోజులుగా సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయానికి చేరుకోగా ఆర్డీవో కార్యాలయ పాలనాధికారి గణేష్ సైకిల్ యాత్రకు సంఘీభావం తెలిపారు.

అక్రమంగా మద్యం, డబ్బు తరలించొద్దు



తనిఖీ చేస్తున్న పోలీసులు

వీర్నపల్లి, ఏప్రిల్ 4 : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బు రవాణా చేయొద్దని ఎస్‌ఐ రమేష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ప్రజలందరూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నం దున ఎన్నికల నియమాలను పాటించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ రాజిరెడ్డి, కానిస్టేబుళ్లు ప్రశాంత్, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఒకరి అరెస్టు

ముస్తాబాద్, ఏప్రిల్ 4: ద్విచక్ర వాహనాల దొంగను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. చిన్నకోడూర్ మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన మంతూరి మహేష్ గతంలో ముస్తాబాద్‌లో విశాలాక్షి మెస్ వద్ద బైక్, మాతృశ్రీ గార్డెన్ నుంచి బైక్ వేములవాడ తిప్పాపూర్ నుంచి స్కూటీ దొంగతనం చేశాడు. సీసీటీవీ సహాయంతో నిందితుడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూరుకు చెందిన గుండవెని నారాయణ, బురుజుకింది ప్రవీణ్ గౌడ్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులుకేసు నమోదు చేశారు.

గుడుంబా తయారీ కేసులో ఒకరి రిమాండ్

ముస్తాబాద్, ఏప్రిల్ 4 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళా గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ కేసులో రిమాండ్‌కు పంపినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెపు రాధిక గుడుంబా అమ్ముతూ గతంలో పట్టుబడింది. స్థానిక తహసీల్దార్ ఎదుట ఒక సంవత్సరానికి లక్ష రూపాలయ పూచికత్తుపై బైండోవర్ చేశారు. మళ్లీ గుడుంబా విక్రయిస్తూ దొరకడంతో నోటీసు అందించారు. డబ్బులు కట్టకపోగా తిరిగి గుడుంబా విక్రయిస్తుండడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రాధికను రిమాండ్‌కు పంపినట్లు సీఐ మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో ఓ ద్విచక్రవాహనదారుడిని ట్రాలీ ఆటో గురువారం ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. జవహర్ నగర్‌కు చెందిన మార్క సది అనే ద్విచక్రవాహనాదారుడిని వెనుకనుంచి ట్రాలీ ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌కు తప్పిన నీటి గండం

- కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి జోక్యంతో నీటి సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం
- ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా సరఫరా



ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టు

కోల్‌సిటీ, ఏప్రిల్ 4: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)కు నీటి గండం తప్పింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో సరిపడా నిల్వలు లేవని, ఏప్రిల్‌లో ఆర్ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరా చేయలేమని ఇరిగేషన్‌శాఖ పేర్కొనడంతో ఆర్ఎఫ్‌సీఎల్ వర్గాలు ఆందోళనకు గురయ్యాయి. ఏప్రిల్, మే నెలలో యూరియా ఉత్పత్తి జరిగితేనే రాబోయే వర్షాకాల సీజన్‌లో రైతాంగానికి యూరియా సరఫరాకు అవకాశం ఉంటుంది. పరిశ్రమకు ఎల్లంపల్లి నుంచి నీటి సరఫరా నిలిచిపోతే యూరియా ఉత్పత్తికి ఆటంకం కలుగనున్నది. ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్‌కు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ కార్యదర్శి రాష్ట్రప్రభుత్వ ప్రధానా కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ మేరకు లేఖ రాశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటాదారుగా ఉంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో సగం తెలంగాణకే సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకంగా మారింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా నీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 138మీటర్లకు దిగువన నీరు ఉంటే సరఫరా జరిగే అవకాశం ఉండదు. కేవలం మంచినీటి అవసరాలు, ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి అవసరాలకే వినియోగించే అవకాశం ఉంది. 134 నుంచి 138మీటర్ల మధ్య డెడ్ స్టోరేజీలో ఎల్లంపల్లిలో 2.35టీఎంసీల నీటి నిల్వలుంటాయి. ఈ నీటిని వినియోగించుకుని ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తికి ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం మిషన్ భగీరథ స్కీమ్ నుంచి రోజుకు 18 క్యూసెక్కుల నీటిని ఆర్ఎఫ్‌సీఎల్‌కు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరిన ప్రత్యేకంగా సబ్ మెర్సిబుల్ మోటార్లు బిగించి హైదరాబాద్ మెట్రో పాలిటిన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ద్వారా నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు హెచ్ఎండబ్ల్యూఎస్ అంగీకారం కూడా తెలిపింది. బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ సీ సుదర్శన్‌రెడ్డి ఈ మేరకు గురువారం మున్సిపల్‌శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి లేఖ రాశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌కు రోజూ 18క్యూసెక్కుల నీటి సరఫరా బాధ్యత తాము తీసుకుంటామని లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ అవసరాలకు రోజూ 330క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 58క్యూసెక్కులు, ఆర్ఎఫ్‌సీఎల్‌కు 18క్యూసెక్కులు కలిసి రోజూ 406క్యూసెక్కులు నీటి సరఫరా చేయాల్సి ఉంది. ప్రాజెక్టు నీటి మట్టం 138మీటర్లకు దిగువన పడిపోయిన సందర్భంలో హెచ్ఎండబ్ల్యూఎస్‌తో పాటు ఆర్ఎఫ్‌సీఎల్ కూడా సబ్ మెర్సిబుల్ మోటార్ల బిగింపు కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక ఆధికారి ఆర్వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీ కర్ణన్

సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సరఫరా చేయాలని వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రత్యేక అధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, మిషన్‌భగీరథ, మున్సిపల్, మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు జిల్లాలో మంచి వ్యవస్థను, కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసుకున్నారన్నారు. మిషన్‌భగీరథ ద్వారానే ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా భవిష్యత్ కొరత ఏర్పడే అవకాశం ఉందని, స్థానికంగా ఉన్న ఇతర నీటి వనరులను వినియోగించుకోవాలని అన్నారు. ప్రస్తుతం మిషన్‌భగీరథ మెయిన్ పైప్‌లైన్ ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ వద్దకు ముందుగా నీరు చేరుకునే విధంగా చూడాలన్నారు. మిషన్‌భగీరథలో సాంకేతిక సిబ్బంది ఇంజనీర్లు, షిఫ్టుల వారీగా 24 గంటలు పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరా సజావుగా జరిగేందుకు ప్రత్యేక అభివృద్ధినిధుల కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ప్రతీ రోజు ఇంటింటికి నీటి సరఫరా వాస్తవిక వివరాలు అందించాలని అన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఇంటికి నీటి సరఫరా చేసేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో, వేములవాడ, సిరిసిల్ల, మున్సిపాలిటీల్లో ఉన్న బోరు బావులు, అవసరమైన మరమ్మతు చేశామని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో రూ.2.49 కోట్లతో 136 పనుల్లో 60 పనులు పూర్తి చేశామని, 75 పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. నీటిసరఫరాకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 9398684240కు సంప్రదించాలని సూచించారు. అనంతరం అగ్రహారం మిషన్‌భగీరథ ప్లాంట్‌ను పరిశీలించారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, మిషన్‌భగీరథ ఈఈలు జానకి, విజయ్, భూగర్భ జలశాఖ అధికారి నర్సింహులు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, టీపీవో అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సైదాపూర్, ఏప్రిల్ 4: సైదాపూర్ మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన తూటి లక్ష్మిపతి(42) అనే వ్యక్తి అనారోగ్యం భరించలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిపతి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కళ్లు కనపడడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో కళ్ల ఆపరేషన్ చేపించుకోవడానికి డబ్బులు లేక మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రాత్రి వరకు తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించారు. గురువారం ఉదయం గొడిశాల శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు అటు వైపు వెళ్తున్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జన్ను ఆరోగ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్‌నగర్‌లో గొడవ..

- కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: కరీంనగర్ అంబేద్కర్‌నగర్‌లో గురువారం సాయంత్రం గొడవ జరగగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలి పారు. తల్హా అనే వ్యక్తిని ఇమ్రాన్ సుఫియన్, సుబన్, మరికొంత మంది కొట్టారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి



హరికృష్ణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4: పరీక్షలు ముగియడంతో సరదాగా ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ(15)ను చెరువులో మునిగి మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు వద్ద గురువారం చోటు చేసుకుంది. అటు అల్మాస్‌పూర్, ఇటు విద్యార్థి స్వగ్రామమైన వీర్నపల్లి మండలం కంచర్లలో విషాదం నింపింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి హరికృష్ణ వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదివి ఇటీవల పరీక్షలు రాశాడు. పరీక్షలు ముగియడంతో తన మిత్రుడు కొమిరె రాకేశ్‌తో కలిసి అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు వద్ద ఉన్న తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లారు. ఈత కోసం హరికృష్ణ నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. గట్టు పైనున్న రాకేశ్ భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశాడు. కొంత దూరంలో ఉన్న గొర్రెల కాపారికి విషయం చెప్పాడు. దీంతో ఇద్దరు కలిసి చెరువు వద్దకు వచ్చే లోపే హరికృష్ణ నీట మునిగి చనిపోయాడు. పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్‌ఐలు రమాకాంత్, రమేశ్ స్థానికులు, యువకుల సహాయంతో శవాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. హరికృష్ణ తండ్రి వెంకటి రెండు నెలల కిందట పెద్ద కొడుకు రాజుకుమార్‌తో కలిసి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు.

- కందకం వల్లే..

అల్మాస్‌పూర్ శివారులోని రంగ చెరువు సమీపంలో బొప్పాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి భూమిని కొనుగోలు చేసి చెరువు చుట్టూ భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడంతోనే విద్యార్థి హరికృష్ణ ప్రాణాలు పోయాయని కుటుంబ సభ్యులు, అల్మాస్‌పూర్, కంచర్ల గ్రామస్థులు ఆరోపించారు. గతంలో రైతులు ఆందోళన చేపట్టిన సదరు వ్యక్తి పట్టించుకోలేదని పేర్కొంటు న్నారు. చెరువు చుట్టు భారీ కందకాలు తీయడంపై అధికారులు స్పందిస్తే తమ కొడుకు ప్రాణాలు దక్కేవని తల్లి లక్ష్మీ, కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల తమ కొడుకు మృతికి కారణమైన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట: చెరువు సమీపంలో భారీ కందకాలు తీసి నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల ఈతకు వెళ్లిన పదో తరగతి విద్యార్థి గొల్లెం హరికృష్ణ మృతికి సంబంధించి ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి చిదుగు గోవర్ధన్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని రంగ చెరువు ప్రాంతంలో ఈతకు వెళ్లి వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలోని పదో తరగతి విద్యార్థి హరికృష్ణ నీట మునిగి చనిపోయాడని పేర్కొన్నారు. చెరువు సమీపంలో చిదుగు గోవర్ధన్‌గౌడ్ భూమిని కొనుగోలు చేసి చుట్టు తీసిన కందకాల్లో నిలిచిన నీటిలో ఈత కోసం ప్రయత్నించగా తన కొడుకు మృతి చెందాడని బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

చేపలు పట్టడంలో వివాదం.. వ్యక్తిపై కత్తితో దాడి

జ్యోతినగర్, ఏప్రిల్ 4: ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఒక వ్యక్తి కత్తిపోట్లకు దారి తీసింది. ఎన్టీపీసీ ఎస్‌ఐ టి ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్కలపల్లి చింతల చెరువులో చేపలు పట్టే విషయంలో కొన్ని రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ మధ్య ఉన్న వివాదం సమసిపోవాలంటే తమకు అడ్డంగా ఉన్న చిట్టబోయిన చందును చంపాలని దాసరి భిక్షపతి, లింగాల సారయ్య, దాసరి లక్ష్మీనారాయణ పథకం వేశారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పొలం పనులకు వెళ్తున్న చందును అడ్డుకున్నారు. దాసరి భిక్షపతి, లింగాల సారయ్య చందును పట్టుకోగా, దాసరి లక్ష్మీనారాయణ కత్తితో పొడిచి ముగ్గురు పారిపోయారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చందును స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి అన్న కొడుకు ఫిర్యాదు మేరకు దాసరి భిక్షపతి, సారయ్య, లక్ష్మీనారాయణలపై కేసు నమోదు చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎండపల్లి, ఏప్రిల్ 4: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో వెల్గటూర్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం పోలీసులు రాజారాంపల్లిలో పెట్రోలింగ్ చేస్తుండగా ఎనమిది ట్రాక్టర్లలో ఇసుక నింపుకొని వస్తుండగా రాజారాంపల్లి వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడంతో అక్రమంగా తరలిస్తున్నారని వాటిని పట్టుకుని ఎస్‌ఐ ఉమాసాగర్ కేసు నమోదు చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



బహుమతులు అందుకున్న విద్యార్థులు

జగిత్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన చైతన్య టెక్నో పాఠశాల 8వ, 9వ తరగతి విద్యార్థులు ఇటీవల బంగారు పతకాలు సాధించడంతో గురువారం పలువురు అభినందించారు. నేపాల్ దేశంలోని పొకార పట్టణంలో గల రంగసాలా స్టేడియంలో ఇటీవల నిర్వహించిన థర్డ్ సౌత్ ఏషియా ఇంటర్ నేషనల్ రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టి సచిన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో కూడా మేటిగా ఉండడం గర్వకారణమన్నారు. కాగా పాఠశాలకు చెందిన సాయి వరుణ్, దన్నపునేని సహర్ష్, హిమోక్షన్, అయాన్ పాషా, కీర్తి వర్ధన్, హర్షిత్, పృధ్వి, మోక్షిత్, రోహిత్, విజితేంద్ర, లక్ష్మీ ప్రణవ్ జూనియర్ (అండర్ 16) ఇండియా టీమ్ తరపున ఆడి గెలుపొందారు. పాఠశాల కోచ్ ఇందిరాల వంశీ కిషోర్, పీఈటీ కొమ్మురాజుల అజయ్ కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య పాఠశాల ఏజీఎం రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్ శివకోటేశ్వర్ రావు, డీన్ బిడారి శ్రీనివాస్, బ్యాచ్ ఇన్‌చార్జీ వంశీ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 4: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు కరీంనగర్ కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 10 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్‌కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఇందులో ఒకరికి 10 రోజులు, మరొకరికి 3 రోజుల జైలుశిక్షతోపాటు ఇద్దరికి కలిపి 3 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగగా 8 మంది వాహనదారులకు 11 వేల రూపాయల జరిమానాను విధించినట్లు సీఐ తెలిపారు.

అడుగంటుతున్న రిజర్వాయర్లు

- రోజరోజుకు తగ్గుతున్న నీటి మట్టాలు
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు



నీటి నిల్వలు తగ్గిన ఎల్ఎండీ

తిమ్మాపూర్, ఏప్రిల్ 4: ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దీంతో రిజర్వాయర్లలో నీటి మట్టాలు రోజురోజుకు తగ్గుతున్నాయి. భూగర్భ జాలలు కూడా ఎప్పుడు లేనంతగా పడిపోతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్లకు ఎగువ నుంచి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఉన్న నీటిని పొదుపుగా వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

● ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా ఆర్వీ కర్ణన్

వేసవి నెలల్లో తాగు నీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రతేక అధికారులను నియమించింది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు కలిపి వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యాసంగిలో ఎల్ఎండీ నుంచి దిగువకు 28.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. మిడ్ మానేరు నుంచి ఎల్ఎండీలోకి 15 టీఎంసీలు వచ్చాయి. ఎల్ఎండీలో ప్రస్తుతం 5.231 టిఎంసిలు నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి 1.24 టీఎంసీల నీరు మరో రెండు, మూడు రోజులలో ఎల్ఎండీలోకి రానున్నాయి. దీంతో ఎల్ఎండీ నీటిమట్టం 6.5 టీఎంసీలకు చేరుతుం ది. ఈ నీటిని జూలై 31 వరకు తాగునీటి కోసం ఉపయోగిస్తారు.

తాగు నీటికి ఇబ్బంది లేదు..



ప్రభుత్వ అదేశాల ప్రకారం వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గినా, జూలై 31 వరకు తాగు నీటికి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఈ యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరాం. రైతులు సహకరించారు. ప్రస్తుతం వేసవి పూర్తయ్యే వరకు తాగు నీటి అవసరాలకే ప్రాధాన్యమిస్తాం.

- బి శంకర్, ఈఎన్సీ

రిజర్వాయర్లలో నీటిమట్టాలు

జలాశయం	నీటి సామర్థ్యం	ప్రస్తుత నీటి నిల్వలు	గత సంవత్సరం నీటి నిల్వలు	డెడ్ స్టోరెజ్	మిషన్ భగీరథకు/అవిరిగా నీటిఖర్చు
దిగువ మానేరు	24.034 టీఎంసీ	5.231 టీఎంసీ	11.712 టీఎంసీ	2.1 టీఎంసీ	143 క్యూసెక్కులు/ 125క్యూసెక్కులు
ఎంఎంఆర్	27.50 టీఎంసీ	7.69 టీఎంసీ	20.14 టీఎంసీ	3.82 టీఎంసీ	40 క్యూసెక్కులు/ 90క్యూసెక్కులు
ఎస్సారెస్పీ	90.3 టీఎంసీ	12.64టీఎంసీ	25.462 టీఎంసీ	5.00 టీఎంసీ	231 క్యూసెక్కులు/ 314క్యూసెక్కులు

ఎండిన పంటల పరిశీలన



ఎండిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్4: కరీంనగర్ రూరల్ మండలం లోని మొగ్దుంపూర్ గ్రామంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎండిపోయిన పంటలను పరిశీలించారు. శుక్ర వారం మొగ్దుంపూర్ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొగ్దుంపూర్‌లో రైతులకు భరోసా కల్పించేందుకు వస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, మేయర్ సునీల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, జక్కం నర్సయ్య, చల్ల హరిశంకర్, సుంకిశాల సంపత్‌రావు పాల్గొన్నారు.

లంబాడిపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో..



ఎండిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

చిగురుమామిడి, ఏప్రిల్ 4: మండలంలోని లంబాడిపల్లిలో సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎండిపోయిన పంటలను పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు గురువారం పరిశీలించారు. పలు గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలను, మామిడితోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్‌లు చేయడం కాకుండా ఎండిన పంటలను పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఎండిన పంటలకు ఎకరానికి 30 వేల రూపాయలు పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎలగందుల రాజయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోళి బాపురెడ్డి, తెరాల సత్యనారాయణ, అందె చిన్న స్వామి, విలాసాగరం, అంజయ్య కయ్యం తిరుపతి, ఉస్మాన్‌పాషా, నక్క ఓదేలు, కయ్యం వీరయ్య, దొంతరవేణి వెంకన్న, బందెల శ్రీనివాస్, బింగి స్వామి, స్వామి, అందె తిరుపతి, సంపత్, కూన బాలయ్య, అప్పాల కుమార్, మంద ఏల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించండి

-ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4: ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రజలను కోరారు. గురువారం 59వ డివిజన్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటిం గ్‌లో లోకసభ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్ గందె మాధవి మహేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ అభివృద్ధి కొనసాగేందుకు ఎమ్మెల్యేగా నేను, ఎంపీగా వినోద్‌కుమార్ ఉంటే కేంద్ర, రాష్ట్ర నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని అన్నారు.

ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఏమైనా అభివృద్ధి చేశారా ఆలోచించండి అని కోరారు. గతంలో కరీంనగర్ అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో కొట్లాడి స్మార్ట్‌సిటీని తీసుకొచ్చిన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే మేమిద్దరం గళం విప్పి అభివృద్ధి చేస్తామని, ఇందుకోసం మరోసారి ఆశీర్వదించి వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈకార్య క్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాంకు ఘన నివాళి

హుజూరాబాద్ లీగల్, ఏప్రిల్ 4: హుజూరాబాద్ కోర్టులో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద పలువురు నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, ఉపాధ్యక్షులు బండి రవీందర్, ముషం మౌనిక, ఎం దివ్య, కె భగవాన్‌రెడ్డి, ఎం వీరసేనరెడ్డి, ముక్కెర రాజు, బండి కళాధర్, పి శ్రీధర్‌బాబు, నక్క సత్యనారాయణ, బాణాల శ్యామ్‌సుందర్, లింగమూర్తి, ఏజీపీ కేతిరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన

శంకరపట్నం, ఏప్రిల్ 4: మండలంలోని తాడికల్ గ్రామ శివారులోని మేల కుంటలో గురువారం ఉపాధిహామీ పనులను డీఆర్‌డీవో శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పర్కులేషన్ టాంక్ పనులను పరిశీలించి, ఉపాధి కూలీలను పెంచాలని పంచాయతీ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఉదయం పూట పనులు నిర్వహించాలని, కొలతలు మూరకు పని చేస్తూ, కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమ్మ రాజేశ్వర్, టీఏ అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

జమ్మికుంట, ఏప్రిల్ 4: జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో ఇటీవల ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేసి రూ.500 బోనస్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పల్లపు రవి, కైలాస్‌కోటి గణేష్, మేక సుధాకర్‌రెడ్డి, కొమ్ము ఆశోక్, మోతె స్వామి, ఇటుకల స్వరూప, తుడి రవిచంద్ర, ఠాగూర్ రాకేష్, రాము, ప్రశాంత్, వెంకటేష్, శ్రీనివాస్, జగన్, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన నైపుణ్యాలుంటే అద్భుత అవకాశాలు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 4: ప్రతి విద్యార్థిలో మెరుగైన నైపుణ్యాలుం టేనే అద్భుత అవకాశాలు లభిస్తాయని తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ టాస్క్ శిక్షకుడు కె రమేశ్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సాంకేతిక పరిజ్ఞానం, విద్యార్థి నైపుణ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, సమన్వయకర్త, అధ్యాపకుడు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిరుతల రామాయణం



జగ్గయ్యపల్లిలో చిరుతల రామాయణం ప్రదర్శిస్తున్న కళాకారులు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 4: జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామంలో నిర్వహించిన చిరుతల రామాయణం ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ వంశీధర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో బోళ్ల కొంరయ్య, పడాల సత్యనారాయణ, రామాయణ కళాకారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4: రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేసే వరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రెండవ ఏఎన్‌ఎంల జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 1,57,000 మంది రెండవ ఏఎన్‌ఎంలు పని చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 6000 మంది ఏఎన్‌ఎంల పనితో పోల్చుకుంటే మిగిలిన వారి పని చాల తక్కువ అని అన్నారు. రోజుకు 10 నుంచి 12 గంటలపాటు ఏకధాటిగా పనిచేస్తున్నది రెండవ ఏఎన్‌ఎంలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 16లో రెండవ ఏఎన్‌ఎంలను కూడా చేర్చి వారిని రెగ్యులర్ చేయాలన్నారు. సమ్మె కాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన 100 శాతం గ్రాఫ్ శాలరీని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. త్రిసభ్య కమిటిని సమావేశపరిచి పని భారం తగ్గించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ గత 9 సంవత్సరాల కాలంలో మొత్తంగా 30 సమ్మెలు జరిగాయని, ఏ సమ్మెకు కూడా సమ్మె కాలం జీతం ఇవ్వలేదన్నారు. అసలు రెండవ ఏఎన్‌ఎం పదంలోనే వివక్షత ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరిని ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా భావిస్తున్నారని అని అనడానికి ఈ పదమే నిదర్శనమన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రజలకు సేవ చేసిన సిబ్బందిని గుర్తించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ఒకే పని ఒకే విద్యార్హత ఉండి జీతంలో భారీ స్థాయి వ్యత్యాసాలు ఉండడం ఆలోచించాల్సిన అంశం అని అన్నారు. రెండవ ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతి పరిధిలో రోగులతో అత్యంత ప్రేమగా ఉంటూ సేవచేసే ఈ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉద్యోగంలో చేరి 20, 25 సంవత్సరాల పాటు సేవలందించి వట్టి చేతులతో ఇంటికి వెళ్ళాల్సి రావడం బాధాకరమని వాపోయారు. ప్రభుత్వాలు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గురించి ఆలోచించి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

● ఈ సదస్సులో రెండో ఏఎన్‌ఎంల జిల్లా నూతన కమిటిని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పి రాణి, ప్రధాన కార్యదర్శిగా ఎం రజిత, కోశాధికారిగా సరోజ, ఉపాధ్యక్షులుగా శోభ, విజయలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా విజయ, సరోజలను ఎన్నుకున్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 14: శ్రీ క్రోధి నామ తెలుగు సంవత్స రాన్ని పురస్కరించుకొని ఉగాది పురస్కారాలు-2024 కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అల్‌దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి (సాహిత్య, సాంస్కృతిక, సమాజిక సేవా సంస్థ) వ్యవస్థాక అధ్య క్షుడు ఇఎస్ఎస్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాలను ఈనెల 21న హైదరాబాద్‌లో అందచేస్తారని తెలిపారు. సమాజసేవా, పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు, విక లాంగులు, విద్యా, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధికల్పన, నాటకరంగం, టీవీ, సిని రంగాల్లో సేవలం దించినవారు. ప్రతిభా పురస్కారాల ఎంపిక కోసం వారి ప్రతిభ గురించి తెలియచేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రిక క్లిప్పింగ్స్, గతంలో వారు పొందిన పురస్కారాల జిరాక్స్‌తో పాటు 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతచేసి ఈనెల 10తేదీలోగా అల్ దిబెస్ట్ అకాడమి, డోర్ నెంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్టు తిరుమలగిరి సికింద్రాబాద్-15కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 3652347207 నంబరులో సంప్రదించాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న డాక్టర్ బీఎస్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్‌కు ఉచిత కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30వేల రూపాయల విలువ చేసే స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. గురువారం స్థానిక అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బీఎస్‌రావు, గంగా దంపతులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉచిత కోచింగ్‌కు ఎంపికైె గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కావలసిన స్టడీ మెటీరియల్‌ను కూడా తన ఫౌండేషన్ నుండి ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించి ఆ తర్వాత సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వెచ్చించాలని సూచించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వ కాలేజీలు, హాస్టల్స్, కోచింగ్ సెంటర్లలో కనీస మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్, అల్లం సాయి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున జిల్లాలో వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదే శించారు. వాటి ఆవాసాలు ధ్వంసం కాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశమందిరంలో వన్య ప్రాణులు, అడవుల సంరక్షణపై కమిటీ సభ్యు లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులను రక్షించుకోవడంతో పాటు వన్య ప్రాణులను కాపాడుకోవాలని అన్నారు. వేసవి నేపథ్యంలో వాటికి తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టిసారించి మొక్కలు ఎండి పోకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్క రిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈకార్య క్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, డీఎఫ్‌వో బాలమణి, మైనింగ్‌శాఖ ఏడీ రామాచారి, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 4: కళాకారులను ప్రోత్సహించాలని టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. విద్యుత్ ఉద్యోగులు నిర్వహించిన చీకటి పువ్వు, ఖరీదైన జైలు నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్న విధంగా ఉన్నాయని విద్యుత్ శాఖలో తమ ఉద్యోగ రిత్యా బాధ్య తలు చేపట్టుతూ, ఇలాంటి సందేశాత్మక నాటక ప్రదర్శనలు చేపట్టడం అభినంద నీయమని అన్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో చీకటి పువ్వు, ఖరీదైన జైల్లు అనే నాటికలను ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి నాటికల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులచే నిర్వహించే నాటిక ప్రదర్శన ఈ కళారంగాన్ని కళాకారులను ప్రోత్సహిం చేందుకు ఈ కళారంగం నైపుణ్యం చెందిం దన్నారు. ఈ నాటక ప్రదర్శనలో పాల్గొన్న వారిని అభినందించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమములో ఇన్‌చార్జి డైరెక్టర్లు రాజు, చౌహాన్, అశోక్ కుమార్, ఎస్ఈ సత్యనారా యణ, జగిత్యాల డీఈలు విజయేందర్ రెడ్డి చంద్రమౌళి, రాజం, తిరుపతి, గోపికృష్ణ, ఏడీఈలు, ఏఈలు, మహిళా ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు కళాకారుల బృందం మంచాల రమేష్, గుడివాడ లహరి, ఉదయ్ కుమార్, శోభారాణి, అనిలు, వెంకట నారాయణ, సత్యనారాయణ, విజయ్ కుమార్, పాత వెంకటేష్, రిషికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

- హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి



కందుగుల గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, జవాన్లు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 4: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. మండలంలోని కందుగుల, కనుకులగిద్దె గ్రామాల్లో కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలన్నారు. సోషల్ మీడియాల్లో అభ్యంతకర మెసెజ్‌లు పంపితే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాల్లో మిటింగ్‌లు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల నియామవళి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ బొల్లం రమేష్,40 మంది సీఐఎస్ఎఫ్ అధికారులు, జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నేరువరం: రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ తాండ్ర నరేష్ సూచించారు. గురువారం మండ లంలోని హన్మాజిపల్లి గ్రామంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఏఈపీఆర్ స్నేహజ్యోతి. ఆర్ఎస్సై ప్రసాద్, మండల పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గంగాధర, ఏప్రిల్ 4: గంగాధర వ్యవసా య పరపతి సంఘం ఆధ్వర్యంలో లింగంపల్లి, లక్ష్మీదేవిపల్లి, గంగాదరలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ కార్యదర్శి మల్లేశం ప్రారంభించారు. కార్యక్రమం లో గంగాధర సొసైటీ సీఈవో గాలిపెల్లి రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్, ఏప్రిల్ 4: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణమాదిగ, దండోర ఉద్యమం మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ దిష్టిబొమ్మను మానకొండూర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జెంకి అ నిల్‌మాదిగ, నాయకులు ఇంజం వెంకట్‌స్వామి, ఆర్. రాంచందర్,ఆంజనేయులు, శంకర్, ఆదిత్య, శ్రీనివాస్, సంపత్, నర్సయ్య, సంపత్, అనిల్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌కు చేరుకున్న రాజ్యాంగ రక్షణ యాత్ర



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

హుజూరాబాద్, ఏప్రిల్ 4: రాజ్యాంగాన్ని రక్షిస్తూ మనువాద పాసీజాన్ని పాతర వేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన జాతీయ మాల మహానాడు రాజ్యాంగ రక్షణ యాత్ర గురువారం రాత్రి హుజూరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ ఈ నెల 2న ప్రారంభమైన రాజ్యాంగ రక్షణ యాత్ర 8న హైద్రాబాద్‌లో ముగిస్తుందని, నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, అసాధి పురుషోత్తం, వెన్నె రాజు, చిట్టిమల్ల సమ్మయ్య, ఎలుక దేవయ్య, సొల్లు బాబు, పుష్పలత, సారయ్య పాల్గొన్నారు.

మండుటెండలో కాలినడక

- రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థుల అవస్థలు
- రెండు బస్సులున్నా అనుమతించని అధికారులు



మధ్యాహ్నం ఎండలో కాలినడకన ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు

చొప్పదండి, ఏప్రిల్4: అసలే ఎండలు మండిపోతున్నాయి.. ఆపై మిట్టమ ధ్యాహ్నం కాలినడక. మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళుతూ అవస్థలు పడుతున్నారు. రుక్మాపూర్ శివారు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో మోడల్ స్కూల్ ఉంటుంది. మం డలంలోని వెదురుగట్టు, రాగంపేట నుంచి రెండు ఆర్టీసీ బస్సులు విద్యార్థులను స్కూల్‌కు చేరవేస్తుంటాయి. కాగా స్వగ్రామంలోనె స్కూల్ ఉన్నందున రుక్మాపూర్ గ్రామ విద్యార్థులకు బస్‌పాస్‌లను ఇవ్వలేదు. పదుల సంఖ్యలో విద్యార్థులు స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్నారు. తమ కళ్ల ముందు నుంచే బస్సులు పోతున్నప్పటికీ ఇక్కడి విద్యార్థులకు ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నందున మధ్యాహ్నం వేళ ఇబ్బందులు పడుతూ ఇళ్లకు చేరుకుంటున్నారు. మధ్యాహ్నం 12. 30 గంటలకు పాఠశాల వదిలిన అనంతరం ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్ర స్తుతం వేసవిలో అయినా విద్యార్థులు అవకాశం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్.4: నగరంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. 11 కెవి ఆటోనగర్ ఫీడర్ పరిధిలో మమతా టాకీస్ ,వివేకానంద పాఠశాల ప్రాంతం, అంబేద్కర్ స్టేడియం ప్రాంతం,మల్లమ్మ వెజ్ మార్కెట్ ప్రాంతం, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్ ,తిర్మల్‌నగర్,ధోబీవాడ ,కమాన్ ప్రాంతం,11 కెవి ఇండస్ట్రియల్/ పద్మానగర్ ఫీడర్ ప్రాంతం, ప్రగతినగర్, లరేల్‌స్కూల్ ఎరియా, సాయిబాబా టెంపుల్ ఎరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిరుపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైస్ ఎంపీపీకి సన్మానం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 4: కొత్తపల్లి వైస్ ఎంపీపీగా ఎంపికైన భూక్య తిరుపతి నాయక్‌ను అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌రెడ్డికే కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4: కరీంనగర్ ఎంపి టికెట్ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికే కేటాయించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. గురువారం ప్రజామిత్ర కార్యా లయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాయితీ పరుడు, నిస్వార్థపరుడు అయిన ప్రవీణ్‌రెడ్డి ముల్కనూరు కో-ఆపరేటివ్‌బ్యాంక్, సొసైటీ ఆధ్వర్యంలో ప్రజా సేవ చేస్తున్నారన్నారు. ములకనూరు డైరీ ద్వారా సొసైటీకి ఆసియాలోనే గుర్తింపు తీసుకు వచ్చారన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ప్రజామిత్ర సర్వే చేయగా ప్రజల మద్దతు ప్రవీణ్‌రెడ్డికే ఉందన్నారు. ఈ సమావేశంలో బోయినపల్లి చంద్రయ్య, సిగిరి శ్రీధర్ పాల్గొన్నారు.

వాసవిక్లబ్ డాక్టర్స్ ఎలైట్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 4: వాసవి డాక్టర్స్ ఎలైట్ కరీంనగర్‌శాఖ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. గురువారం నగరంలోని ఓ హాస్పిటల్‌లో జరిగిన ఈకార్యక్రమానికి ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి హాజరై నూతనంగా ఏర్పడిన వాసవి క్లబ్ డాక్టర్స్ ఎలైట్ కరీంనగర్ అధ్యక్షులుగా డాక్టర్ నార్ల మహేందర్, కార్యదర్శిగా డాక్టర్ కాసం శివకుమార్, కోశాధికారిగా బెల్దె సుమన్‌కుమార్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గవర్నర్ జంధ్యం మాధవి మాట్లాడుతూ ఎలైట్ క్లబ్ ద్వారా సమాజానికి ఎనలేని సేవలందించాలని కోరారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం లభించిందని, ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించి అన్ని వర్గాలు సహయమందిస్తామని అన్నారు. ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆవునూరి శివలీల, కెబినెట్ సెక్రటరీ జంధ్యం మధూకర్, వైస్ గవర్నర్ పబ్బ అరుణ, రీజియన్ చైర్మన్ అక్కెనపల్లి నాగరాజు, సెక్రటరీ కైలాస నవీన్‌కుమార్, స్పాన్సర్ క్లబ్ అధ్యక్షుడు నలుమాచు మనోహర్, క్లబ్ సభ్యులు డాక్టర్ దిలీప్, డాక్టర్ శ్రీకర్, డాక్టర్ బచ్చు అనుదీప్, డాక్టర్ కాసం నీలిమ, డాక్టర్ పూర్ణిమ పాల్గొన్నారు.

'పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

కరీంనగర్ రూరల్, ఏప్రిల్4: సాగునీరు లేక పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు రతన్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకుంటలోని కౌలు రైతులు బాబురాజన్న, జేరిపోతుల సంజీవ్, పైడిపాల ఎల్లయ్య, జేరిపోతుల కార్తిక్‌లకు చెందిన పది ఎకరాలు ఎండిపోయాయన్నారు. కార్యక్ర మంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టవేని రుణు, యువ మోర్చా మండల అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లికి చెందిన దాసరి సురేందర్ కుమారుడు శరత్‌చంద్ర అనారోగ్యంతో ఉండగా రూ. 80వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ గురువారం అందజేశారు. శరత్‌చంద్ర గత కొంతకాలంగా చికిత్స చేయించుకుం టున్నాడు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఈ విషయాన్ని పలువురు ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లగా, చికిత్స కోసం ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ప్రణవ్‌కు శరత్‌చంద్ర తండ్రి సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

- రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం అంబేద్కర్‌లో రైతు దీక్షను చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాం గణ నియామకాలు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హను మాకుమర్ గురువారం తెలిపారు. సోని ఇంటర్‌ప్రైజెస్ కంపెనీ హైదరాబాద్ బ్రాంచ్‌కి 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని పలు వివా హాలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. ఆ యన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● వీణవంక: చల్లూరులో ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. నర్సింగాపూర్, వీణవంక గ్రామాల్లో వివాహ వేడుకలలో పాల్గొని వధూవరులను అశీర్వదించారు.

● గంగాధర: గంగాధర బీజేపీ కార్యాలయంలో గురువారం అ పార్టీ నాయకులు రైతు దీక్ష చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకుడు రేండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరాకు 25వేల నష్టపరిహారం అందించి రైతులను ఆదుకో వాలని డిమాండ్ చేశారు.

● రామడుగు: బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గు రువారం రామడుగులో రైతు దీక్షా కార్యక్రమాన్ని చేపట్టా రు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఒంటెల కరుణాకర్ రెడ్డి , స్టేట్ కౌన్సిల్ సభ్యులు జిన్నారం విద్యాసాగర్, పొ న్నం శ్రీనివాస్‌గౌడ్, కోలపురి రమేశ్, ఎంపీటీసీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● గన్నేరువరం: హైదరాబాద్‌లో ఏప్రిల్ 8న నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను మండల కేంద్రంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు అనుమాండ్ల మల్లేశం ఆధ్వర్యంలో గురువారం ఆవిష్క రించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడి అంజయ్య, నాయకులు ఎలుక దేవయ్య, న్యాత శ్రీనివాస్, న్యాత రమేష్, కొమురయ్య, రాజేశం, రాజేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎస్సారెస్పీ స్థలంలో బుధవారం రాత్రి వేబ్రిడ్జిని, షెడ్‌ను ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఫుల్ రిజర్వాయర్ లెవె ల్ (ఎఫ్ఆర్ఎల్)సర్వే లో భాగంగా ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తు న్న క్రమంలో ఎస్సారెస్పీ స్థలంలో ఓ వే బ్రిడ్జ్‌ను నిర్మాణం ఉన్నట్లు గుర్తించి తొలగించినట్లు తెలిపారు.